# చించేస్తా...!

నవనీతరావుకు సినీమా తీయానలే ఆలోచన పసితనంలోనే వచ్చింది. రిలీజైన తెలుగు సినీమాలు వదలకుండా చూడటం అలవాటు!

గుడ్డి తల్లికి అబద్ధం చెప్పి గ్రామంలో గల రెండెకరాలు అమ్మేసి... అమ్మ బాధ్యత టెంపరరీగా మేనమామకు అప్పగించి రెక్కలు కట్టుకుని వచ్చి హైదరాబాద్‌లో వాలాడు.

టెన్త్ దాకా చదివి డింకీలు కొట్టి చివరికెలాగో పూర్తి చేశానన్పించుకున్న బాలమేధావి నవనీత రావు. చదువు మినహా సినీమాల సంగతులు బాగా వంట పట్టించుకున్నాడు.

బురదలో తిరుగుతూ.. మట్టి వాసనలు కొట్టే వ్యవసాయం చేయటం గిట్టక పోవటంతో పొలం అమ్మేయటం.. ఆడబ్బు తన భవిష్యత్ సినీమా కార్యక్రమానికి ఉపయోగపడుతుందని భావించాడు!

టెన్త్‌లోకి రాకముందే సినీమా కథ తానెందుకు రాయకూడదూ అన్పించటంతో వన్ ఫైన్ మార్నింగ్ చద్ది అన్నం తిని... రూళ్ల కాగితాల లాంగ్ నోట్ బుక్ కొనుక్కొచ్చి మనసులో ఆలోచనకు కథా రూపం ఇచ్చేందుకు వుపక్రమించాడు!

ఇరవైనాలుగు గంటల్లో శ్రమపడి రాసి 'స్క్రిప్ట్' రెడీ చేసి అమితానంద భరితుడైనాడు. సినీమా స్క్రిప్ట్ తయారు చేయటమంటే ఇంత తేలికాన్పించిందతనికి!... కాకినాడ 'కాజ' తిన్నట్టన్పించింది.

కొడుకు చేత వ్యవసాయం చేయించాలనేది కళ్లు లేని తల్లి కోరిక! నవనీత రావుకేమో మట్టిపిసకడం... పొలందున్నటమంటే ఎలర్జీ!

తాను ప్రొడ్యూసరో... డైరక్టరో అయితే వందెకరాల పొలం కొనేసి ట్రాక్టర్ల తో దున్నించి పంటలు పండించాలనే ఆలోచన తనది!

తనకు గల సినీమా పిచ్చి గురించి పాపం పిచ్చి తల్లికి తెలీదు.

సినీమారైటర్‌గానైనా వెలిగిపోయే రోజొచ్చి అవలీలగ ఓవంద సినీమాలకు కథ మాటలు రాసి పారేసిన రోజున కన్నతల్లికి కంటిచూపు వచ్చినంతగ సంబరపడాలనేది నవనీతరావు ఆశ!

ఇప్పుడు హేళన చేసిన వారే రేపు దశ తిరిగినప్పుడు తనకు బ్రహ్మరథం పట్టక మానరన్పించింది.

పొలం అమ్మగా వచ్చిన సగం మొత్తాన్ని ఫిక్సెడ్ డిపాజిట్లో వేసి మిగతాది తన ఖర్చుల కోసం సేవింగ్స్ అకౌంట్లో వుంచుకున్నాడు.

ఫిలింనగర్‌లో అడుగిడగానే తనకు స్వాగతం పలుకుతారని... తనను గుర్తించి మెడలో దండలు వేస్తారని ఆశించాడు పూర్ నవనీతరావు. తమకంటే తమకు సినిమా కథ రాసిమ్మని నిర్మాతలు 'క్యూ'లో నిలబడతారని కలలుకన్నాడు పాపం!

తీరావచ్చి నెల్లాళ్లు కావస్తున్నా... ఎందరిని కల్సినా... తాను కథ చెప్తానంటే వినేవారే కరువైనారు.

రైటర్‌గా ఛాన్స్ రాకపోవటం మూలాన పోనీ డైరెక్షన్‌శాఖలో ఏ ప్రముఖ దర్శకుని వద్దనో... అసిస్టెంట్‌గా చేస్తేనో?... అనే 'థాట్' వచ్చినా మేథ వద్దని శాసించింది.

తాను ఆశించింది జరగనందుకు నిరుత్సాహపడక... పట్టు వదలని విక్రమార్కుడై ముందుకు సాగుతున్నాడు. గెలుపు కోసం గజనీ మహమ్మద్ ఎన్నిసార్లు దండయాత్రలు చేయలేదూ? తనూ అంతే అనుకున్నాడు. 'లేటు' రాబోయే అదృష్టానికి పునాది అనేది నవనీత్‌రావ్ ఫిలాసఫీ!

నో! అసిస్టెంట్‌గ చేరితే అదృష్టం కలిసి రాకపోవచ్చు.... ఎప్పటికైనా రైటర్‌గానే ఇండస్ట్రీలో 'లెగ్' పెట్టాలనేసి డిసైడైనాడు.

పేరగాన్ చెప్పులు అరడజను అరిగిపోయినా కథ విన్పిస్తాను మొర్రోని వెంటపడినా వినే నాథుడే కరువైనాడు. డెవిల్‌కైనా ఒకరోజు రాకపోదు అనుకున్నాడు. ఓర్పు ఏనాటికైనా జయించకపోదు అన్పించింది.

ఆర్జన లేక పోగాతన వద్ద వున్నది హారతి కర్పూరమౌతోంది. అయినా నోఫియర్స్... జాతక రీత్యా మీరో పదిరోజుల్లో శుక్రమహర్దశ రానుంది. ఇక చూసుకో నా రాజా!... పట్టిందల్లా బంగారమే!... సిద్ధాంతి చెప్పిన మాట గుర్తుకొచ్చినయ్. మనిషిలోనవోత్సాహం వెల్లి విరిసింది.

× × × × ×

ఫిలింనగర్ ఓగల్లీలో చివరగా వున్న ఇంటిముందు గోడకు 'పిడకల

పాపారావ్. ఫిలిమ్ డైరక్టర్' నేమ్ బోర్డు కన్పించగానే నవనీతరావుకు ప్రాణం లేచివచ్చినట్టుయింది. తాను నక్కను తొక్కి వచ్చాడేమో అనుకుని చంకలు గుద్దుకుంటూ గేటు తీసి లోనికి నడిచి 'కాలింగ్ బెల్' నొక్కేడు.

'ఎవరప్పా నువ్వు?' తలుపు తీసిన ఎదురుగా నిలబడ్డ నవనీతరావుని ప్రశ్నించాడు.

'డైరక్టర్ గారిని కలవాలి సార్....'

'నేనేనప్పా డైరక్టర్ పాపారావ్‌ను.. లోపలికిరా...' ఆహ్వానం పలికాడు.

హాల్లోకి ఎంటరై చుట్టూ కలియచూస్తూ... పెచ్చులూడిన గోడలు.. చెల్లా చదురుగా వున్న పుస్తకాలు మేగజైన్స్... వ్రేలాడే బూజు.. చూస్తూ దర్శకుల వారి ఇల్లు 'భూత్ బంగళా'లా గుందేంటి చెప్మా... అనుకున్నాడు. పాపారావ్ వంటిన లుంగీ... చేతుల్లేని బనీను.. బట్ట నెత్తి చూస్తూ 'పాపం' అన్పించింది!. అవతారం చూస్తూ వీడేం డైరక్టర్ చెప్మా? పైకి కన్పించకుండా గొణుక్కున్నాడు.

'ఇంకో ఛైర్ లేదు... సారీ! ఇద్దరం చాపమీదే కూర్చుందాం...' చాపనేల మీద పరిచాడు.

తమరెవరన్నట్టు నవనీతరావు ముఖంలోకి చూశాడు పాపారావ్.

'నేను రైటర్ నవనీత రావును...'

'ఐ.సీ! మీరు టాలెంట్ వున్న రైటరే కావచ్చు!- కాకపోతే ఇండస్ట్రీకి కథలతో పన్లేదప్పా. నిర్మాతలు కావాలి!

లైట్‌బోయ్ నుండి డైరక్టరనబడే వ్యక్తి వరకు అలవోకగా సినిమా కథలు చెప్పగల దిట్టలు!- మీరు ప్రొడ్యూసరేమోనని పొరబడ్డాను...'

ఆమాట విన్న నవనీత రావు అయోమయంలో పడ్డాడు.

'నేనీ ఫీల్డు కొచ్చి ముప్ఫైయేళ్లయిందప్పా! డైరక్టర్ కావటానికే ఇరవైయ్యేళ్లు పట్టింది. నిర్మాతల వేటలో మిగతా పీరియడ్ వృధా అవుతూ వచ్చింది!- ఓ ప్రొడ్యూసర్ నన్ను ఎంకరేజ్ చేయాలని ముందుకొచ్చాడు. పిక్చర్ కంప్లీటై రిలీజైంది. కానీ పిక్చర్ ఆడలే.. బాగుండక పోవటం కాదు. వండరేంటంటే... పెద్ద హీరోలతో తీసిన పెద్ద నిర్మాతల పిక్చర్లు కూడా అదేడేటుకి రిలీజైనయ్. అక్కడితో దీని బండ బడ... మానెత్తిన బండపడ్డట్టాయో! నిర్మాతలబోదబో! నాకేమో ఫ్యూచర్ అమావాస్య చీకటైంది.

'సినీమా ఫ్లాపైందన్నమాట...'

'ఎట్టా? ఆమాటంటే నేనొప్పను! స్టోరీ డైలాగులూ బ్రహ్మాండం! అదృష్టం కలిసి రాలే... అంతే!- ఇండస్ట్రీలో నాకు పేరైతే వుంది గాని నావద్ద 'దుడ్డు' మాత్రం ఇల్లే!-'

పాపారావ్ పూర్ కండిషన్‌కు జాలిపడి మరోసారి అయ్యో పాపం అనుకుని లేచి నిలబడి బైటికొచ్చాడు నవనీతరావు.

× × × × ×

జంతికల జానమ్మంటే ఫిలిం ఇండస్ట్రీలో పెద్ద పేరు! బడా ప్రొడ్యూసరామె! సినీమా స్టూడియో ఓనరు! బోలెడంత పరపతి పలుకుబడి గలామె!

జానమ్మ ఇండస్ట్రీలో అడుగుపెట్టకముందు చేయని బిజినెస్సంటూ లేదు. పూల వ్యాపారం... పండ్ల వ్యాపారం... స్వగృహ ఫుడ్ సెంటర్స్!... ఆమె తయారు చేసే జంతికల కోసం జనం ఎగబడేవారు. అప్పట్నించే ఇంటిపేరు 'జంతిక' అని మార్చుకుంది. మొగుడ్ని వదిలేసి రౌడీలను రెంట్‌కు తీసుకుని మేపుతూ ల్యాండ్ సెటిల్‌మెంట్స్ చేసి కోట్లార్జించింది. అక్కడ్నించి సినీమాలు తీసి గొప్ప నిర్మాత అన్పించుకోవాలనే దురదతో ఇండస్టీలో ఆమె గోల్డెన్ లెగ్ పెట్టింది. దశ తిరిగి... తీసిన సినీమాలు హిట్లై... చివరికి స్టూడియో కట్టింది... సారీ! ఓనరైంది.

ఎంతటి వారైనా జానమ్మముందు చేతులు కట్టుకు నిలబాడాల్సిందే! ఆమె కనుసైగ చేస్తే గాని హిరోలైనా హిరోయిన్లయినా కూర్చును సాహసించరు.

దటీజ్ జానమ్మ! ఇండస్ట్రీకే పెద్దమ్మ!

అంతటి మహోన్నతమైన సినీ నిర్మాత జంతికల జానమ్మ నుండి నవనీత రావుకి పిలుపొచ్చింది. ఇంటికి కారొచ్చింది. అదృష్టం కలిసొచ్చింది!

కారెక్కిన నవనీత రావుకి అదృష్టపు అందలం ఎక్కినట్టు ఫీలైనాడు.

ఓపెద్ద బంగళాముందు కారాగింది!

అది బంగళానా? నో!!- రాజమహల్‌ను మరిపించేట్టుంది. కారుదిగి మహల్‌లోకి కాలు పెట్టాలంటే గుండె ధైర్యం చాల్లేదు. ఇది నిజమా? కలా? అన్పించకపోలేదు.

లోపల అతిపెద్ద బంగారపు ఛైర్ అంటే పరువు తక్కువ! సింహాసనం

అనటమే సబబు! అది జానమ్మ కోసం ప్రత్యేకంగా చేయించుకుంది కాబోలు అన్పించింది. ఇక రెండు వరుసల్లో వెండి తాపటం చేసిన సోఫాలను పోలినవి కళ్లబడేసరికి ఇవి సందర్శకుల కోసమేమోనన్పించింది.

జానమ్మగారొచ్చేదాక కూర్చోకూడదని కళ్లతో వారించాడు అక్కడున్న మనిషి! ఆమె పేరు ప్రఖ్యాతుల గురించి వినటమే గాని ఆమెనెప్పుడూ చూచింది లేదు తాను.

ఇంతలో ప్రొడ్యూసర్ జానమ్మ రానే వచ్చింది. ఆమెను చూడగానే మూర్ఛ వచ్చినట్టన్పించింది.

రెండు వందల కే.జీల వెయిట్ వుంటుందేమో అన్పించింది. మనిషి పూతకి... తాటకిలా అవుపించింది. అయినా గ్లామర్‌కేం కొదువలేదు. మాంచి మేకప్‌లో వున్నదేమో చూడగానే మొక్కాలన్పించటంలో చేతులు జోడించాడు నవనీతరావు.

జానమ్మ బంగారు సింహాసనంపై ఆశీనురాలవుతూ కూర్చోమని కళ్ళతో సైగ చేయటంతో అతి వినయంగ వొదిగి ఎదురుగా వున్న వెండి కుర్చీలో ఓమూల పిల్లిలా ముడుచుక్కూర్చున్నాడు నవనీతరావు.

మళ్లీ గభాలున లేచి జానమ్మ ముందు సాష్టాంగపడ్డాడు.

'ఏందయ్యోవ్?... లెగు లెగు...' బొంగురు గొంతుతో అంది జానమ్మ.

'అట్టాకూకో!... నువ్వురైటరు వంట! సినీమాకు కథ బాగావండుతావా మరి?... కుర్రాడివి హీరోలెక్కుండావ్... యాసమిత్తా ఏత్తావా?- కాదు కతే రాత్తావా?' తమ్మ నములుత్తా మాట్లాడింది జానమ్మ.

జానమ్మను చూస్తూ నోట మాట పెగల్లేదు. 'వామ్మో' అనుకున్నాడు.

'నా సినిమాలన్నీ హిట్లే!- కాకుంటే... ఇటీవల తీసిన 'బాదుడు' పిక్చర్ ఫట్ కొట్టింది- కత బాగోలేదన్నారంతా!- పోతేపోయిందిలే... ఒకటి రెండు ఫ్లాపైనా లెక్కలేదు - ఈసారి కొత్తోడి సేత కొత్త రకం కత రాయించుకోవాలని నీకోసం కబురంపినా...' అనేసి గారపళ్లు బైటపడేలా నవ్వింది.

జానమ్మను చూస్తేనే భయం... గుండెలో దడ మొదలైంది. కథ ఈమెకు ఎలా చెప్పాలని వొణుకు ప్రారంభమైంది.

'ఇదిగో సూడూ... నెల్లాళ్ల బట్టి కథసెప్తామంటూ ఎందరో వచ్చి పోయారు.

నాకు నచ్చులే!- నాపానం తీశారనుకో! నువ్వయినా వెరైటీ కత సెప్పు! టూకీగా సెప్పు నచ్చితే లచ్చిస్తా అడ్వాన్సు కింద... కొత్త పిల్ల కాయవైనా నీ స్టోరీ నచ్చిందంటే నిన్నొదల్ను... అర్థమైనాదా?-'

ఇంతలో డ్రింకు లొచ్చినయ్!

'అవును నువ్వు హాటా... కోల్డా?...'

"అమ్మా! కథ నచ్చితే హాట్... లేకపోతే కోల్డే..."

'ఓరి నీ బండబడ తెలివైనోడివే! ముందు కోకోకోలా తాగు... పెష్‌గా వుంటావ్. ఆ తర్వాత కత చెప్తువు....'

తాగి త్రేన్చాడు నవనీతరావు.

'అఁ! కత సెప్పుదువుగానీ... ముందు... మన సినీమా టైటిలేందో సెప్పు!- టైటిల్ నచ్చగానే యాభైవేల చెక్కిస్తాను. మిగతా మాటలు తరువాత మాటాడుకుందాం... ఏమంటావ్ రైటరూ?-'

ఆమె ఇష్టమే తన అభీష్టమైనట్టు హీరోలా నవ్వాడు.

'నీ స్టోరీ రెడీగా వుందా... రాయాలా?- రాసివుంటే పేరేంది?..'

గదంతా కలియచూశాడు. ఆవులించి వళ్లు విరుచుకుని తన ఫైల్లోంచి ఓ తెల్ల కాగితాన్ని తీసి దాన్ని రెండుగా చీల్చాడు.

'ఏందయ్యా టైటిలు సెప్పమంటే గారడీ చేత్తున్నావ్....'

'ఫక్కున నవ్విన నవనీతరావు' ఇది మ్యాజిక్ కాదు మేడమ్! నా ఐడియా మీరు క్యాచ్ చేయలేదు....'

అదేందో నోటితో సెప్పరాదూ? యాక్షన్ దేనికంట?-'

'చించేస్తా!...'

'నాకేడనో కాలుద్ది! సినీమాకు పేరు చెప్పమంటే చించుతానంటావేంది? ఏంచించుతావ్?-'

'నా కథ... మీరు తీయబోయే సినీమా పేరే 'చించేస్తా' మేడమ్.

రాక్షసిలా పగలబడి నవ్వి 'ఓరి నీ బండబడ! సినీమా పేరే 'చించేస్తా'నా?- అదిరందయ్యా రైటరూ - నీ వంటోడు ఫీల్డుకు కావాల.- నువ్వు సెప్పిన టైటిల్ బెమ్మాండంగ నచ్చి నాది!- ఇంద ఈ యాభైవేలుంచుకో... నాకవతల వేరే అర్జంటు

పనుండా... పోవాల...' పి.ఏ. చేత చెక్ రాయించి దాని మీద దస్కత్ చేసి నవనీతరావుకిచ్చి మనం మళ్లీ కలుద్దాం... నే కబురుపెడతాలే...' అంటూ లేచి మహల్లోకి భారంగా నడుస్తూ వెళ్లిపోయింది.

చెక్కు అందుకుని.... పళ్లికిలించి.. కార్లో తిరిగి తన రూమ్ చేరుకున్నాడు నవనీతరావు.

× × × × ×

మళ్లీ జానమ్మ నుండి కబురు లేదు. కాకరకాయ లేదు. తను వెళ్లి నా దర్శనం ఇవ్వలేదు. కారణమేమై వుంటుందాని బుర్రగోక్కున్నాడు. బోధపడ్లేదు.

ఆరు నెల్లకు 'చించేస్తా' టైటిల్‌తో జానమ్మ పిక్చర్ రిలీజైంది.

ఆ విషయం తెల్సుకున్న నవనీతరావు కేవలం 'టైటిల్' మాత్రమే స్వీకరించి పేమెంట్ ఇచ్చేసి ఆ టైటిల్‌కి తగిన కథ వేరొక రైటర్‌తో రాయించుకున్న జానమ్మ తెలివికి బాధపడ్డాడు నవనీతరావు.

'చించేస్తా'... సినీమా మాత్రం కలెక్షన్లతో వెండితెరను నిజంగానే చించేసింది. రికార్డు బద్దలు చేసింది.

సినీమాకు కథ రాసే ఛాన్స్ తనకు రాకపోయేనేని గెండెలు బాదుకుని బావురమన్నాడు నవనీతరావు!!-

(సమాప్తం)